క్లుప్తంగా

వేసవి శిక్షణ శిబిరాలతో ప్రతిభ వెలుగులోకి



బయాలజిస్ట్ చక్రవర్తి ముందు శిక్షణ విధానాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థులు

గోపాలపట్నం: గోపాలపట్నం హైస్కూల్ గ్రౌండ్‌లో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరాన్ని జీవీఎంసీ బయాలజిస్ట్ చక్రవర్తి బుధవారం సందర్శించారు. శిక్షణ సమగ్రంగా జరుగుతుందా లేదా అన్న విషయాలను ఆరా తీశారు. పిల్లలకు ఉదయం పౌష్టికాహారం ఇస్తున్నారా.. ఏఎన్‌ఎంలు ఫస్ట్ ఎయిడ్ కిట్లు ఏవిధంగా ఉన్నాయో పరిశీలించారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



బాధిత కుటుంబ సభ్యులకు నగదు అందిస్తున్న గుణిశెట్టి శ్రీనివాసరావు

గోపాలపట్నం: జీవీఎంసీ 91వ వార్డు నేతాజీ వీధిలో ఇటీవల అనారోగ్యంతో గంజి రామగౌరి సంతోషికుమారి మృతి చెందింది. ఆమెకు వైఎస్సార్ బీమా కింద రూ. లక్ష మంజూరైంది. జీవీఎంసీ 91, 92వ వార్డుల వైఎస్సార్ సీపీ అధ్యక్షులు గుణిశెట్టి శ్రీనివాసరావు, అప్పలస్వామినాయుడు తక్షణ సాయంగా రూ.10వేలు ఆమె కుటుంబ సభ్యులకు అందించారు. త్వరలోనే బాధిత కుటుంబ సభ్యుల ఖాతాలోకి మిగిలిన రూ.90వేలు జమ అవుతాయని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ వెల్ఫేర్ కార్యదర్శి సుమలత, మహిళా పోలీస్ పద్మలత, వలంటీర్ నాగమణి, ఆర్పీ కృష్ణవేణి పాల్గొన్నారు.

ప్రవల్లికకు అభినందన



ప్రవల్లికను అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం గొల్లవీధి ప్రాంతానికి చెందిన వాకాడ ప్రవల్లిక యాదవ్ విశాఖ జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గాజువాకలో నిర్వహించిన మహిళా విభాగ బాక్సింగ్ పోటీల్లో సత్తాచాటింది. 66 కేజీల విభాగంలో గోల్డ్ మెడల్ సాధించింది.దీంతో గాజువాక మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ ప్రవల్లికయాదవ్‌ను అభినందించారు. ఇలాంటి పతకాలు మరిన్ని సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీనియర్ బాక్సర్ రేష్మాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జపనీస్ లాంగ్వేజ్ కోర్సు బలోపేతానికి సహకారం

ఆరిలోవ : జపాన్‌కు చెందిన తోషిబా కంపెనీ వైస్ ప్రెసిడెంట్ పి.ఎం.బాలాజీ బుధవారం ఏయూను సందర్శించారు. ఈ సందర్భంగా వర్సిటీ రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్ ఆయనకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం వారు సమావేశ మందిరంలో భేటీ అయ్యారు. ఏయూలో నిర్వహిస్తున్న జపనీస్ లాంగ్వేజ్ కోర్సుల గురించి చర్చించారు. ఈ కోర్సులు విద్యార్థులకు ఉపయుక్తంగా ఉండేలా తగిన సహకారం అందించాలని రిజిస్ట్రార్ ఈ సందర్భంగా తోషిబా కంపెనీ వైస్ ప్రెసిడెంట్ బాలాజీని కోరారు. ఈ మేరకు స్పందించిన బాలాజీ మాట్లాడుతూ జపనీస్ లాంగ్వేజ్ కోర్సు బలోపేతం చేయడానికి పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జపనీస్ ఇన్ఫర్మేషన్ అండ్ స్టడీ సెంటర్ డైరెక్టర్, ఫారిన్, లింగ్విస్టిక్స్ డిపార్ట్‌మెంట్ హెడ్ ప్రొఫెసర్ డి.వి.ఆర్.మూర్తి పాల్గొన్నారు.

ఆవిష్కరణల వేడుక.. ఆధ్యాత్మిక వీచిక

తుంగ్లాం గ్రామంలో ముగ్గురమ్మలు కొలువుదీరిన శుభ ముహూర్తాన ఆధ్యాత్మిక పరిమళాలు భక్తులను తన్మయులను చేశాయి. స్వామీజీకి స్వాగతం పలికేందుకు తరలివచ్చిన భక్తజనసందోహంతో రహదారులన్నీ కిక్కిరిశాయి. శీలానగర్‌లో కలియుగ దైవం తిరుమల బాలాజీ విగ్రహావిష్కరణతో భక్తి సమీరాలు పలకరించాయి. కన్యకాపరమేశ్వరి ఆలయంలో గాలిగోపురం ప్రతిష్ట, మాతృశ్రీ నగర్‌లో సాయినాథుడి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలతో భక్తుల ఉత్సాహం మరింత ఇనుమడించింది. ఆవిష్కరణ వేడుకల నేపథ్యంలో ఏకాదశి పర్వదినాన గాజువాక నియోజకవర్గం బుధవారం పండగ శోభను సంతరించుకుంది.



తుంగ్లాంలో ప్రతిష్ఠించిన కుంచాలమ్మ, దుర్గాలమ్మ, ముత్యాలమ్మ అమ్మవార్ల విగ్రహాలు



కుంచాలమ్మ అమ్మవారి సన్నిధిలో సిద్ధేశ్వరానంద భారతి, రమ్యానంద భారతీ స్వామి



స్వామీజీ, మాతాజీలకు స్వాగతం పలికేందుకు ర్యాలీగా తరలి వెళ్తున్న తుంగ్లాం గ్రామస్తులు



ప్రతిష్ఠించనున్న సాయినాథుడికి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న సుబ్బారావు దంపతులు

అక్కిరెడ్డిపాలెం: తుంగ్లాం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయాల్లో కుంచాలమ్మ, దుర్గాలమ్మ, ముత్యాలమ్మ అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. విశాఖ శ్రీ లలితా పీఠాధిపతి శ్రీ సిద్ధేశ్వరానంద భారతి, శ్రీ శక్తి పీఠాధీశ్వరి మంత్ర మహేశ్వరి మాతాజీ శ్రీ రమ్యానంద భారతి నూతన ఆలయాల్లో అమ్మవార్ల విగ్రహాలను ఆవిష్కరించారు. ముందుగా శ్రీ సిద్ధేశ్వరానంద భారతి, శ్రీ రమ్యానంద భారతిలను ఆలయాల వద్దకు తోడ్కొని రావటానికి తుంగ్లాం గ్రామకమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తులు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డితో కలిసి శీలానగర్ అయ్యప్ప స్వామి ఆలయం వద్దకు చేరుకుని భారీ స్వాగతం పలికి, ఆలయాల వద్దకు తీసుకువచ్చారు. అనంతరం కుంచాలమ్మ వారి ఆలయంలో పూజలు చేసిన స్వామీజీ, మాతాజీ అమ్మవారి విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం దుర్గాలమ్మ, ముత్యాలమ్మ వార్ల ఆలయానికి చేరుకుని అమ్మవార్ల విగ్రహాలను ఆవిష్కరించారు. ఆలయాల వద్ద హోమాలు, విశేష పూజలు నిర్వహించారు. గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, పలువురు కార్పొరేటర్లు, రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన భారీ అన్నసమారాధనలో 20 వేల మందికి పైగా భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా సాయినాథుడి విగ్రహ ప్రతిష్ఠ

కూర్మన్నపాలెం: 86వ వార్డు మాతృశ్రీనగర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీ లక్ష్మీ గణపతి దత్తాత్రేయ సహిత షిరిడీ సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని బుధవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇరగవరపు వెంకట శ్రీధర్ స్వామి, వారి శిష్య బృందం ఆధ్వర్యంలో ప్రతిష్ఠాపనోత్సవాలు జరిగాయి. రాష్ట్ర వైఎస్సార్‌సీపీ అదనపు కార్యదర్శి, 86వ వార్డు ఇన్‌చార్జి దామా సుబ్బారావు, దమయంతి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు.

శాస్త్రోక్తంగా గాలి గోపురం ప్రతిష్ఠ

పెదగంట్యాడ: హౌసింగ్ బోర్డు సమీపంలోని కన్యకా పరమేశ్వరి పంచాయతన ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన గాలి గోపురాన్ని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, శ్రీధర్ స్వామీజీ బుధవారం ప్రారంభించారు. అమ్మవారికి విశేష పూజలు చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు, సాయంత్రం పరస ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో చైర్మన్లు ముమ్మిడి శెట్టి ముత్యాలశెట్టి, త్రిమూర్తులు, వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆనంద్‌కుమార్‌కు ఘన స్వాగతం

మల్కాపురం: ఏపీ సూక్ష్మ మధ్య తరహా ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ తన అమెరికా పర్యటన ముగించుకుని బుధవారం నగరానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు విమానాశ్రయంలో పలువురు ప్రముఖులు, నాయకులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్, ఏఎంసీ చైర్మన్ ఆల్ఫా కృష్ణ, వైఎస్సార్‌టీయూ అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్, కార్పొరేటర్లు బల్లా లక్ష్మణరావు,కొణతాల సుధ,గుండపు నాగేశ్వరరావు, నాయకులు నూకరెడ్డి,ధనలత,తోనంగి వెంకటరమణి, చుక్క వరలక్ష్మి,నరేష్,పీలా అనంత్‌కుమార్, పిలక రామ్మోహన్‌రెడ్డి, పుర్రె సురేష్‌యాదవ్,చుక్క ప్రసాద్‌రెడ్డి,కృష్ణ,దాడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఆనంద్‌కుమార్‌తో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, బద్రీనాథ్ తదితరులు

పొగాకు వినియోగంతో ఆరోగ్యం గుల్ల

మల్కాపురం: చెడు అలవాట్లు మనిషిని బలహీనం చేస్తాయని... వాటిని కట్టడి చేయకపోతే తనను నమ్ముకున్న వారి జీవితం నాశనమవుతుందని ప్రజాపిత బ్రహ్మకుమారి సంస్థ (శ్రీహరిపురం) ప్రతినిధి సింధు అన్నారు. అంతర్జాతీయ పొగాకు నివారణ దినోత్సవం సందర్భంగా బుధవారం 60వ వార్డు గుల్లలపాలెం వద్ద సిగరెట్లు తాగడం వల్ల అనర్థాలపై యువత, ప్రజలకు అవగాహన కల్పించారు. పొగాకు వల్ల గుండె బలహీన పడి తద్వారా గుండె జబ్బులు వస్తాయన్నారు. సున్నితమైన గుండెను పదిలంగా ఉంచుకోవాలంటే సిగరెట్లు, చుట్ట ఇతర పొగాకు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. యువత చెడు అవవాట్లు మాని ధ్యానం వైపు ధ్యాస ఉంచాలన్నారు.



సిగరెట్లు తాగడం వల్ల నష్టాన్ని వివరిస్తున్న సింధు

నైతిక విద్య అవసరం

మల్కాపురం: మల్కాపురం శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం చిన్నారులకు నీతి కథలు బోధించారు. రచయిత సత్తిరాజు మాట్లాడుతూ నైతిక విద్య డిగ్రీ స్థాయిలో కాకుండా ప్రాథమిక, ప్రాథమికోన్నత స్థాయిలోనే అవసరమని వివరించారు. నైతిక విద్య వల్ల విద్యార్థుల ప్రవర్తన మారుతుందని తద్వార ఉత్తమ పౌరులుగా మెలుగుతారని చెప్పారు. ఉపాధ్యాయులు చెప్పే నీతి కథల్లో నీతిని చిన్నారులు గ్రహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి, కార్మిక నాయకుడు బి.సత్యానందం, గ్రంథాలయాధికారి అజేయ్‌కుమార్ పాల్గొన్నారు.



చిన్నారి చెబుతున్న నీతి కథను శ్రద్ధగా వింటున్న అతిథులు

పాలిసెట్ వెబ్ ఆప్షన్ల ఎంపిక వాయిదా

సింహాచలం: ఈనెల ఒకటో తేదీ నుంచి ప్రారంభం కానున్న పాలిసెట్-2023 వెబ్ ఆప్షన్ల ఎంపిక ప్రక్రియ తాత్కాలికంగా వాయిదా వేసినట్టు పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ తెలిపారు. అలాగే రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్ పేమెంట్ చెల్లించేందుకు ఈనెల 5వతేదీ వరకు గడువు పొడిగించినట్టు చెప్పారు. త్వరలోనే వెబ్ ఆప్షన్ల ఎంపిక తేదీలను ప్రకటించడం జరుగుతుందని, అభ్యర్థులంతా ఈవిషయాన్ని గమనించాలని కోరారు

ఉక్కు కర్మాగార పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

కూర్మన్నపాలెం: వేలాది మంది కార్మికులకు ప్రత్యక్షంగా, లక్షల మంది ప్రజలకు పరోక్షంగా జీవనోపాధి కల్పిస్తున్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 839వ రోజుకు చేరుకున్నాయి, ఈ దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. విశాఖ ఉక్కును ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో విశాఖ ఉక్కు కోసం ప్రత్యేకంగా చర్చించాలన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న ఆదినారాయణ

నేడు ప్రత్యేక స్పందన

గోపాలపట్నం: గోపాలపట్నం తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ప్రత్యేక స్పందన కార్యక్రమం నిర్వహించనున్నామని తహసీల్దార్ కొర్ర జయ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు స్పందన ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. రెవెన్యూ డివిజన్ అధికారి హుస్సేన్ సాహెబ్ ఆదేశాల మేరకు ప్రత్యేక స్పందన చేపడుతున్నామన్నారు. ప్రజల సమస్యలపై వినతులు అందజేయవచ్చన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మల్కాపురం: శ్రీహరిపురం సబ్‌స్టేషన్ పరిధి 11 కేవీ జనతాకాలనీ, జవహర్‌నగర్ ఫీడర్ల వద్ద వార్షిక మరమ్మతుల కారణంగా ఆయా ఫీడర్ల పరిధి ప్రాంతాలకు శుక్రవారం ఉదయం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని జోన్-2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీకే నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఇందిరాకాలనీ-1,2 ఏరియాలు,జవహర్ నగర్,బర్మాకాలనీ,జనతాకాలనీ,సెయింట్ ఆన్స్ ఆస్పత్రి ఏరియా, శ్రీహరిపురం,పిలకవానిపాలెం, కుంచిమాంబకాలనీ,ఎదురవానిపాలెం,ఉప్పరకాలనీ,శ్రీనివాస్‌నగర్,కుంచమ్మకాలనీ,దుర్గా బార్ డౌన్ ఏరియా,గుల్లలపాలెం,కోడిపందాలదిబ్బ ఏరియా ప్రాంతాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన వివరించారు.

హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం



హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదమని వివరిస్తున్న సీఐ మళ్ల అప్పారావు

గోపాలపట్నం: ఎన్ఏడీ జంక్షన్‌లో కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు బుధవారం విస్తృత తనిఖీలు చేపట్టారు. కంచరపాలెం సీఐ మళ్ల అప్పారావు హెల్మెట్ లేకుండా ప్రయాణించే ద్విచక్ర వాహనదారులకు అవగాన కల్పించారు. హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరమని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఆటోలను ఆపి రికార్డులు పరిశీలించారు. పాత చలనాలు వసూలు చేశారు. కొన్ని నెలలుగా ప్రత్యేకంగా ఈ ప్రక్రియ చేపట్టామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు ఏఎస్ఐ లక్ష్మణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

7 నుంచి మరిడిమాంబ ఉత్సవాలు



మరిడిమాంబ

సింథియా: సుదీర్ఘ చరిత్ర గల సింథియా మరిడిమాంబ అమ్మవారి పండగను ఈ నెల 7 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 7వ ఉదయం 5 గంటలకు మేళ తాళాలతో ఉత్సవ చాటింపు, 8న సాయంత్రం 7 గంటలకు పుట్ట బంగారం వేడుక ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి రోజు అమ్మవారికి దూప, దీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. 15వ తేదీన పండగ ముగింపు మహోత్సవంలో భాగంగా అమ్మవారికి వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించి, సాయంత్రం జాతర నిర్వహించనున్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకోవాలని కోరారు.

కెమికల్ ఇంజినీరింగ్ వర్క్‌షాప్

ఆరిలోవ: ఆంధ్రా యూనివర్సిటీలో కెమికల్ ఇంజినీరింగ్ విభాగంలో బుధవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌ను వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ సమత, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.కృష్ణమోహన్, ప్రొఫెసర్ ఎస్.వి.నాయుడు, తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ-మొబిలిటీ, మోడలింగ్ అండ్ కంట్రోల్ ఆఫ్ వేస్ట్ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వర్క్‌షాప్ కన్వీనర్ డాక్టర్ ఆర్.పద్మశ్రీ, సైంటిస్ట్ శ్రీనివాస్ కుమార్, శేషగిరిరావు పాల్గొన్నారు.

కార్మికులకు అండగా నిలుస్తా

మల్కాపురం: ఎల్‌పీజీ కార్మికులకు అండగా ఉంటానని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. ఇటీవల ఎల్‌పీజీ ప్లాంట్‌లో శ్రీహరిపురం ప్రాంతానికి చెందిన పల్లా శ్రీధర్ అనే వ్యక్తి గుండెపోటుతో మృతి చెందిన సంగతి తెలిసిందే. దీంతో లోడింగ్ కార్మికులంతా మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ గేటు వద్ద ఆందోళన చేపట్టారు. అప్పటి నుంచి యాజమాన్యం తమను ఇబ్బంది పెడుతుందని కార్మికులు బుధవారం ఆనంద్‌కుమార్‌ను కలిసి విన్నవించారు. తమకు న్యాయం చేయాలని కోరారు.దీనిపై స్పందించిన ఆనంద్‌కుమార్ యాజమాన్యంతో మాట్లాడి ఉపాధికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని వారికి భరోసా కల్పించారు. ఆనంద్‌కుమార్‌ను కలిసిన వారిలో ఎల్‌పీజీ లోడింగ్ అన్ లోడింగ్ యూనియన్ ప్రతినిధులు,సభ్యులు ఉన్నారు.



ఎల్‌పీజీ లోడింగ్ కార్మికులతో ఆనంద్‌కుమార్

రైతు బజార్లలో వసతులు కల్పిస్తాం

- సీఈవో నందకిశోర్

గోపాలపట్నం: రైతు బజార్లలో మౌలిక వసతులు కల్పిస్తామని ఆంధ్రప్రదేశ్ రైతు బజార్ల ముఖ్యకార్యనిర్వాహక అధికారి ఎం. నందకిశోర్ తెలిపారు. ఆయన బుధవారం రాత్రి గోపాలపట్నం రైతు బజారులో ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఇక్కడి పరిస్థితులు.. రైతు ఇబ్బందులు గురించి ఆరా తీశారు. రెండో పూట బజారు జరుగుతున్న సమయంలో లైటింగ్ లేక ఇబ్బందులు పడుతున్నట్టు గుర్తించారు. లైటింగ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. రైతులకు మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఆయనతో పాటు జిల్లా వ్యవసాయ మార్కెట్ శాఖ జాయింట్ డైరెక్టర్ సుధాకర్, డిప్యూటీ డైరెక్టర్ ఎర్రన్న, అసిస్టెంట్ డైరెక్టర్ షేక్ యాసిన్, గోపాలపట్నం రైతు బజారు ఈవో నారాయణరావు, రైతులు పాల్గొన్నారు.



గోపాలపట్నం రైతు బజారులో రైతులతో మాట్లాడుతున్న సీఈవో నందకిషోర్

ఘనంగా గోపి పుట్టిన రోజు

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు వైఎస్సార్ సీపీ నాయకుడు అయితంశెట్టి గోపి పుట్టిన రోజులు వేడుకలు కొత్తపాలెంలో ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయ కర్త ఆడారి ఆనంద్‌కుమార్ పాల్గొని గోపి చేత కేక్ కట్ చేయించారు. భవిష్యత్తు నాయకుడిగా ఎదగాలని ఆశీర్వదించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, నాయకులు ఆళ్ల పైడిరాజు, మళ్ల శ్రీనివాసరావు, గేదెల మురళీ కృష్ణ, అయితంశెట్టి కోటేశ్వరరావు, కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.



ఆడారి ఆనంద్ కుమార్, గోపిని గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు

బాక్సింగ్ విజేత యువరాజుకు అభినందన



యువరాజును అభినందిస్తున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించిన చంద్రనగర్‌కు చెందిన పప్పల యువరాజును జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు బుధవారం అభినందించారు. తమిళనాడు రాష్ట్రం పల్లవరంలో తమిళనాడు బాక్సింగ్ అసోసియేషన్ క్లబ్, కంటోన్మెంట్ బోర్డు సంయుక్త ఆధ్వర్యంలో గత నెల 26 నుంచి మూడు రోజుల పాటు బాక్సింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 10 తరగతి చదువుతున్న యువరాజు ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించాడు. ఈ సందర్భంగా బెహరాను తన కుటుంబ సభ్యులతో వెళ్లి యువరాజు మర్యాద పూర్వకంగా కలిశారు. బాక్సింగ్‌లో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని బెహరా ఆకాంక్షించారు.

కార్పొరేట్ శక్తుల నుంచి దేశాన్ని కాపాడుకోవాలి

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు

ఉక్కునగరం: దేశ పాలకులు అనుసరిస్తున్న విధానాల మూలంగా లబ్ధి పొందే కార్పొరేట్ శక్తుల నుంచి దేశాన్ని కాపాడుకోవడం కార్మికుల కర్తవ్యమని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.వి. నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. యూనియన్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉక్కునగరం సీఐటీయూ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన × కార్మిక ఉద్యమం-నూతన పరిస్థితులు₹ సదస్సులో ఆయన మాట్లాడారు. సీఐటీయూ లక్ష్యం కార్మికులను, సంఘాలను ఏకం చేసి, ఐక్య ఉద్యమాలతో ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించడమన్నారు. నియంతృత్వ నాయకుల కారణంగా వ్యవస్థలు గాడి తప్పుతున్నాయన్నారు. అమిత అధికార దాహం కలిగిన నాయకుల చేతి నుంచి దేశాన్ని రక్షించుకోవాల్సి ఉందన్నారు. స్టీల్ సీఐటీయూ నాయకులు జె. అయోధ్యరామ్, ప్రధాన కార్యదర్శి యు. రామస్వామి, అధ్యక్షుడు వై.టి.దాస్ ప్రసంగించిన కార్యక్రమంలో కె.ఎం.శ్రీనివాస్, జి.శ్రీనివాస్, నమ్మి రమణ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు

వైభవంగా తిరుమల బాలాజీ దివ్యక్షేత్ర ప్రతిష్ట

అక్కిరెడ్డిపాలెం: శీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన శ్రీ తిరుమల బాలాజీ మందిరంలో బాలాజీ విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు బుధవారం వైభవంగా జరిగాయి. విశేష పూజలు, హోమాలు, చక్రస్నానాలు భక్తిశ్రద్ధలతో జరిపించారు. వేకువజాము నుంచే ఆలయంలో విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, కుంభారాధనం, ఉక్త హోమాలు చేశారు. సుముహూర్తమున యంత్ర రత్న ధాతున్యాసములు, బింభ ధ్వజ స్తంభ స్థాపనము, వాస్తు హోమం, మహా పూర్ణాహుతి, కళావాహనము, విశేషారాధనలు శాస్త్రోక్తంగా జరిపించారు. మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు. సాయంత్రం శ్రీవారి కల్యాణాన్ని కనులపండువగా జరిపించారు. శ్రీ బాలాజీ విగ్రహాన్ని ఎస్టీబీఎల్ అధినేత గుత్తికొండ బాలాజీ దంపతులు దర్శించుకుని పూజలు చేశారు. బాలాజీ మాలధారణ చేపట్టిన ఎస్టీబీఎల్ ఉద్యోగులు, సిబ్బంది పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



దివ్య క్షేత్రంలో ఆవిష్కరించిన తిరుమల బాలాజీ విగ్రహం

గిరిజన మహిళ హత్యకు కారకులను శిక్షించాలి

ఉక్కునగరం: ఇటీవల జరిగిన గిరిజన మహిళ హత్యకు కారకుడైన శ్రీనివాసకుమార్‌పై కఠిన చర్యలు చేపట్టాలని స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గిరిజన మహిళ హత్యకు నిరసనగా ఉక్కు టీటీసీ కూడలి వద్ద బుధవారం నిర్వహించిన ధర్నాలో నాయకులు మాట్లాడారు. నిందితుడిపై కఠిన చర్యలు చేపట్టడం ద్వారా మరొక మహిళకు ఇలా జరగకుండా గుణపాఠం చెప్పాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు బయ్యే మల్లయ్య, బి.తాడన్న, సత్యం నాయుడు, ఎస్. సత్యనారాయణ, కొమ్ము ప్రసాదరావు, ఎస్. మోహన్ బాబు తదితరులు పాల్గొన్నారు.



ఉక్కు టీటీసీ కూడలి వద్ద ధర్నా చేస్తున్న ఎస్సీ, ఎస్టీ సంఘం నాయకులు